నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 5 ఏప్రిల్ 2025 SANGAREDDY


సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# దండులా కదలుదాం

## బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి 20 వేల జనసమీకరణ

- పాదయాత్రగా వెళ్లనున్న వెయ్యి మంది విద్యార్థులు,యువత
- 100 ట్రాక్టర్లతో ర్యాలీగా సభకు బయలుదేరుదాం
- పెద్దఎత్తున వరంగల్ సభకు తరలివెళ్లి సిద్దిపేట కీర్తిని చాటాలి
- 27న అన్ని పల్లెలు, పట్టణాల్లో జెండా పండుగ
- కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు
- సిద్దిపేటలో పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం
- పార్టీ ఆవిర్భావ నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్న హరీశ్‌రావు


నాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈనెల 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభకు సిద్దిపేట జిల్లా నుంచి దండులా కదిలి విజయవంతం చేద్దామని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జనసమీకరణపై నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేటకు 25 ఏండ్ల గులాబీ జెండా కీర్తి ఉందని, పార్టీ పెట్టి లక్ష్యాన్ని సాధించి, ఆ లక్ష్యంతో అద్భుతమైన అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిపిన పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు. 2001లో సిద్దిపేట కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆశీర్వాదం, జిల్లా ప్రజల ఆశీస్సులతో గులాబీజెండా ఎగరేసిండు మన కేసీఆర్ అని గుర్తుచేశారు. సిద్దిపేటకు అంత ఘనకీర్తి ఉందన్నారు. సిద్దిపేట వాళ్లులేని బహిరంగ సభ లేదని, ఎక్కడ సభ జరిగినా.. ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు సిద్దిపేట నాయకులు పనిచేశారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ సిద్దిపేట అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ర్టాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారని హరీశ్‌రావు కొనియాడారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 20 వేల మందికి పైగా పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు.మరో వెయ్యిమంది విద్యార్థులు, యువత పాదయాత్రగా తరలివెళ్తారని పేర్కొన్నారు. వంద ట్రాక్టర్లతో ర్యాలీగా సభకు బయలు దేరాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. భారీగా తరలివెళ్లి సిద్దిపేట కీర్తిని మరోసారి చాటాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకుడు, నంగునూరు మండలం ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి వరంగల్ సభ ఖర్చులకు పార్టీకి తనవంతుగా రూ.25 వేల విరాళం ప్రకటించారని హరీశ్‌రావు చెప్పారు. మందపల్లి గ్రామస్తులు కూలి పనిచేసి తామే స్వచ్ఛందంగా సభకు వస్తామని ప్రకటించడంతో వారిని హరీశ్‌రావు అభినందించారు.

### గులాబీ జెండా పండుగ

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27న ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. 25 ఏండ్ల ఆవిర్భావ వేడుకలు ఒక పండుగలా నిర్వహించాలన్నారు. కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జెండా పండుగను విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

### నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్న హరీశ్‌రావు

2001లో పార్టీ ఆవిర్భావం సందర్భంగా జెండాను, కరీంనగర్ సింహగర్జన సభ సిద్దిపేట నాయకుల కరపత్రాలు, విద్యా, ఉద్యోగ సదస్సు రైతు నాగలి గుర్తుతో ఉన్న కరపత్రం, 2004లో హరీశ్‌రావు మంత్రిగా ఏడాదిలో చేసిన సిద్దిపేట అభివృద్ధిపై ముద్రించిన కరపత్రం, నాటి జ్ఞాపకాలు సిద్దిపేట నాయకులతో కలిసి నెమరు వేసుకున్నారు. సన్నాహక సమావేశంలో రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, కడవేర్గు రాజనర్సు, పార్టీ మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సిద్దిపేటలో పార్టీ సన్నాహక సమావేశానికి హాజరైన నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు

## వీడియో పోస్ట్ చేసిన వ్యక్తికి రిమాండ్

మిరుదొడ్డి, ఏప్రిల్ 4: మైనర్స్ అసహజ లైంగిక వీడియోను సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. అక్బర్‌పేట-భూంపల్లి పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన పుట్ట అనిల్ కొన్ని రోజులుగా మైనర్ అసహజ లైంగిక వీడియోలు చూస్తూ, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. సైబర్ సెక్యూరిటీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితుడు నేరం ఒప్పుకున్నందున అతని నుంచి ఫోన్, సిమ్, కార్డు డీవీడీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అనిల్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో లైంగిక పరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

# కొంటరా.. కొనరా!

## సిద్దిపేట జిల్లాలో పొద్దుతిరుగుడు కొనుగోళ్లు బంద్..

- ఏడు కేంద్రాల్లో నిలిచిన సేకరణ
- జిల్లావ్యాప్తంగా 17,928క్వింటాళ్లు కొనుగోలు
- కేంద్రం టార్గెట్ పూర్తి
- సేకరణకు ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళనలో రైతులు


గజ్వేల్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రంలో పొద్దుతిరుగుడు

గజ్వేల్, ఏప్రిల్ 4: సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, తొగుట, చిన్నకోడూరు, బెజ్జంకి, హుస్నాబాద్, కట్కూర్‌లో మార్చిలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. జిల్లాలో 2 వేల మంది రైతులు 12 వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగుచేశారు. జిల్లాలో 18,360 క్వింటాళ్ల సేకరణకు కేంద్ర ప్రభుత్వం టార్గెట్ ఇచ్చింది. జిల్లాలోని గజ్వేల్, తొగుట, చిన్నకోడూరు. బెజ్జంకి, కట్కూర్‌లో ఇచ్చిన టార్గెట్ పూర్తవడంతో కొనుగోళ్లను అధికారులు నిలిపివేశారు. సిద్దిపేట, హుస్నాబాద్ కేంద్రాల్లో శుక్రవారం కొనుగోళ్లు పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు జిల్లాలోని 7 కొనుగోలు కేంద్రాల ద్వారా 1653 మంది రైతుల నుంచి 17,928 క్వింటాళ్ల పొద్దుతిరుగుడును క్వింటాల్‌కు రూ.7280 ధరకు కొనుగోలు చేశారు. ఇంకా ఏడు కేంద్రాల్లో కొనుగోళ్లకు పొద్దుతిరుగుడు సిద్ధంగా ఉంది. అయినా అధికారులు కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు రోడ్ల పైకొచ్చి ఆందోళనలు చేస్తున్నారు. గురువారం తొగుట మండల కేంద్రంలో రైతులు పొద్దుతిరుగుడును రోడ్డుపై పోసి వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో షెడ్ కింద రైతులు పొద్దుతిరుగుడును అమ్మేందుకు తీసుకొచ్చి పెట్టారు. గురువారం కురిసిన భారీ వర్షంతో షెడ్ కిందకు నీళ్లు రావడంతో తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తేకాని తిరిగి పొద్దుతిరుగుడు కొనుగోళ్లు చేసే పరిస్థితి కనిపించడం లేదు. కొద్ది రోజులుగా రైతులు పొద్దుతిరుగుడును కేంద్రాలకు తెచ్చి పడిగాపులు కాస్తున్నారు.

> సిద్దిపేట జిల్లా పూర్తిస్థాయిలో పొద్దుతిరుగుడు పంటను అధికారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మార్చిలో 7 పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి కేంద్రం ప్రభుత్వం విధించిన టార్గెట్ మేర మాత్రమే పంటను కొన్నారు. కానీ, ఇంకా చాలామంది రైతుల సన్‌ఫ్లవర్ పంట కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంది. కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం కురిసిన వర్షానికి పలుచోట్ల పంట తడిసిపోయింది. ప్రభుత్వ నిర్ణయం కోసం రైతులు కేంద్రాల వద్ద ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మరో 6వేల క్వింటాళ్ల పొద్దుతిరుగుడు కొనుగోలు చేయాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల్లో సదుపాయలు లేకపోవడంతో చాలామంది రైతులు ఇంటి వద్దనే పంటను ఉంచారు.

### ప్రభుత్వ అనుమతి రావాలి..

రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేస్తాం. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ పూర్తి చేశాం. ఇంకా జిల్లాలో పొద్దుతిరుగుడు కొనుగోలుకు సిద్ధంగా ఉంది.
– క్రాంతి, మార్క్‌ఫెడ్ డీఎం సిద్దిపేట


గజ్వేల్ మార్కెట్ యార్డులో తడిసిన పొద్దు తిరుగుడు గింజలను చూపుతున్న రైతు స్వామి

# కాలువల అనుసంధానం పూర్తిచేయాలి

- వచ్చే యాసంగి నాటికి శాశ్వత కాలువల నిర్మాణం చేపట్టాలి
- ఘన్‌పూర్ పంప్‌హౌస్ ప్రారంభానికి సిద్ధం చేయాలి
- ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి
- చంద్లాపూర్ లిఫ్ట్, గోపులాపూర్, కస్తూరిపల్లి చెక్‌డ్యామ్ పనులు ప్రారంభించాలి
- ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, హాజరైన అధికారులు, నాయకులు

సిద్దిపేట, ఏప్రిల్ 4: సిద్దిపేట నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారానికి కాలువల నిర్మాణ పనులను అధికారులు వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశించారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈసారి యాసంగిలో సాగునీటి ఇబ్బందులు తలెత్తాయని, అధికారుల సమన్వయంతో తాత్కాలిక కాలువ ఏర్పాటు చేయడంతో కొంత ఇబ్బందులు తొలిగాయని, వచ్చే యాసంగి వరకు శాశ్వతంగా కాలువ నిర్మాణం చేయాలని సూచించారు. అందుకు ప్రణాళికలు రూపొందించాన్నారు. ఈసారి 50వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చామని, ఆయకట్టు పెరిగిన దృష్ట్యా ఆర్డీ-7, 8, 9 కాలువలు త్వరితగతిన పూర్తిచేసి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్‌లకు అనుసంధానం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు, కాలువల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలని, చంద్లాపూర్ లిఫ్ట్ పనులు, కస్తూరిపల్లి, గోపులాపూర్ చెక్‌డ్యామ్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఘన్‌పూర్ పంప్ హౌస్ ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీలు మాణిక్యరెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, వేముల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముల్కల కనకరాజు, ఆంజనేయులు, ఎల్లారెడ్డి, కీసర పాపయ్య తదితరులు పాల్గొన్నారు.


దేవునూర్ హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులు

## దేవునూర్ హాస్టల్‌లో విద్యార్థి మిస్సింగ్

కుటుంబీకులు, బంధువుల ధర్నా


కుమార్ (ఫైల్)

వట్‌పల్లి, ఏప్రిల్ 4: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని దేవునూర్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 8వ తరగతి విద్యార్థి మిస్సింగ్ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థి మిస్సింగ్ అయినట్లు విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న ఎం.కుమార్ మార్చి 21 నుంచి హాస్టల్‌లో కనబడడం లేదని తెలిసింది. ఈ విషయం తెలిసినా హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంతో వ్యవహరించారని, విద్యార్థి తల్లిదండ్రులకు ఏప్రిల్ 2న సమాచారం అందించి కొంత నగదు ఇచ్చి ఆచూకీ కనుక్కోవాలని వార్డెన్ చెప్పినట్లు తెలిసింది. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థి తల్లిదండ్రులు బంధువులతో కలిసి వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. సీఐ అనిల్‌కుమార్ హాస్టల్‌కు చేరుకుని తల్లిదండ్రులు, హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థి మిస్సింగ్‌పై విచారణ చేపతామని సీఐ తెలిపారు. కాగా, విద్యార్థి మిస్సింగ్ విషయం తెలిసి శుక్రవారం హాస్టల్ ఎదుట విద్యార్థి కుటుంబీకులు, బంధువులు బైఠాయించి ఆందోళన చేపట్టారు.

## చదువులో పోటీపడాలి

సిద్దిపేట, ఏప్రిల్ 4: యువత ఆటలతో పాటు చదువులో పోటీ పడాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల జరిగిన కేసీఆర్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ బెట్టింగ్, డ్రగ్స్‌కు బానిస కావొద్దన్నారు. గతంలోనే కేసీఆర్ ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నిషేధించారని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోక యువత, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బెట్టింగ్ యాప్స్ నిర్వహించే వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు క్రీడాకారులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## అంబులెన్స్ ఉన్నా ప్రయోజనం లేకపాయె

- ప్రభుత్వ దవాఖానలో అందని వైద్యం

హత్నూర, ఏప్రిల్ 4: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయిన వ్యక్తిని దవాఖానకు తీసుకెళ్తే సకాలంలో వైద్యం అందలేదు. దవాఖానకు తరలించాల్సిన అంబులెన్స్ డ్రైవర్ లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో క్షతగాత్రుడిని తరలించిన సంఘటన హత్నూరలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గోవిందరాజ్‌పల్లికి చెందిన వడ్డె రమేశ్ శుక్రవారం బైక్‌పై వెళ్తుండగా హత్నూర సమీపంలో అదుపుతప్పి కిందపడి పోయాడు. దీంతో తీవ్రగాయాలైన రమేశ్‌ను చికిత్స నిమిత్తం హత్నూర ప్రభుత్వ దవాఖానకు స్థానికులు తీసుకెళ్లారు. అక్కడ వైద్యం చేయడానికి వైద్యుడు లేకపోవడంతో స్టాఫ్‌నర్సు మెరుగైన చికిత్స కోసం వేరేచోటకు తీసుకెళ్లాలని సూచించింది. దీంతో స్థానికులు దవాఖాన ఆవరణలోని అంబులెన్స్‌లో తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. అంబులెన్స్ డ్రైవర్‌తో పాటు సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో తరలించాల్సి వచ్చింది. దీనిపై వెంటనే జిల్లా వైద్యాధికారికి స్థానికులు ఫోన్ చేయగా, అంబులెన్స్ డ్రైవర్ సొంత పనిమీద వెళ్లాడని, మరునాడు డ్రైవర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో సరిగ్గా వైద్యసేవలు అందడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలని ప్రజలు కోరారు.


క్షతగాత్రుడిని ఆటోలో మెరుగైన చికిత్సకు తరలిస్తున్న కుటుంబీకులు


ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పుల్లూరు రైతులు

## మీకృషితోనే నీళ్లొచ్చినయి సార్

హరీశ్‌రావుకు రైతుల కృతజ్ఞతలు

సిద్దిపేట, ఏప్రిల్ 4: మీ కృషితోనే పుల్లూరు చెరువులోకి నీళ్లు వచ్చి పంటలు పండుతున్నాయని ఆనందంతో పుల్లూరు గ్రామ రైతులు శుక్రవారం ఎమ్మెల్యే హరీశ్‌రావును సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే హరీశ్‌రావు సార్ తన సొంత డబ్బులతో కాలువ తవ్వించి నీళ్లు తెప్పించారన్నారు. కాలువ తవ్వకం వల్ల 400 ఎకరాల్లో సాగునీళ్లు అందాయని సంతోషం వ్యక్తం చేస్తూ హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు రైతులు చెప్పారు.

## అర్హులకు పథకాలు అందిస్తాం

- మంత్రి దామోదర రాజనరసింహ


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి దామోదర్, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఏప్రిల్ 4: అర్హులందరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. పేదలకు సన్నబియ్యంతో కడుపు నింపేందుకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రహదారులపై ప్రతి 40 కిలోమీటర్ల దూరంలో ఒక ట్రామా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరిపడా అంబులెన్స్‌లు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. నర్సాపూర్‌లో ట్రామా కేంద్రం, సీటీ స్కాన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

### ఆరు నెలల కల నెరవేరింది..

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆరు నెలలుగా నియోజకవర్గ లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని, ఎట్టకేలకు వారికి శుక్రవారం అందజేసినట్లు వెల్లడించారు. కొన్ని మండలాల్లో చెక్కుల వాలిడిటీ కూడా అయిపోయాయని గుర్తుచేశారు. ఆడపిల్లల పెండ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదని కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆమె కోరారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు మండలంలోని జక్కపల్లిలో 25 ఎకరాల స్థలం కేటాయించామని, మిగతా నియోజకవర్గాలకు ఇచ్చినట్లు నర్సాపూర్‌కు నిధులు మంజూరు చేయాలని మంత్రి దామోదరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి విజ్ఞప్తి చేశారు. చిలిపిచెడ్, మాసాయిపేట్ మండలాల్లో పీఏసీఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నర్సాపూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. నర్సాపూర్‌లో బస్తీ దవాఖానకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అధికార పార్టీ సహకారం ఉండాలని, మాసాయిపేట్ మండలంలో తాను లేకుండానే ప్రొటోకాల్ విస్మరించి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసినందుకు ఆర్డీవో, తహసీల్దార్‌లపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కలలను సాకారం చేసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్


గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

కోహెడ, ఏప్రిల్ 4: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాకారానికి కృషిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమం , రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కోహెడ మండలంలోని నాగసముద్రాల మాడల్ స్కూల్‌ను కలెక్టర్ మను చౌదరితో కలిసి సందర్శించి గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు పెంపొందించుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. మంచి కెరీర్‌కు చదువుతో ఎంతో అవసరం అన్నారు. ఎంపీగా పనిచేసినప్పుడు 32 మండలాలకు 29 మాడల్ స్కూల్స్ తెచ్చినట్లు గుర్తుచేశారు. మాడల్ స్కూల్‌లో అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు కొత్త యూనిఫాం పెడుతున్నామని, గోడలకు పెయింట్ వేస్తున్నామని, వాష్‌రూమ్‌లో నీటి సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం చెంచల్‌చెర్వుపల్లిలో జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి, మంద ధర్మయ్య, గాంధీజ్ఞాన్ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో కిష్టయ్య, తహసీల్దార్ సురేఖ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.